'ప్రతిభకు పట్టాభిషేకం'

చిక్కడపల్లి: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో 'ప్రతిభకు పట్టాభిషేకం' శీర్షికతో సాంస్కృతిక రత్న పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కళాకారుల ప్రతిభను గుర్తించి గౌరవించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన రామరాజు లక్ష్మీశ్రీనివాస్, సయ్యద్ జానీబాషా, సాయిసుప్రియకు దక్షిణమధ్య రైల్వే పూర్వ జీఎం రామకృష్ణ పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రామారాజు శ్రీనివాసరావు, లంకా లక్ష్మీనారాయణ, శైలజ, శిరీష, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

నల్లకుంట: తిలక్‌నగర్ బస్తీలోని శ్రీ గణపతి దుర్గామాత ఆలయ నూతన పాలక మండలి చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులను నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆలయ ఈవో జయంతి నూతనంగా నియమితులైన ఆలయ కమిటీ చైర్మన్ ఉమాదేవి శ్యామ్‌రావు, ట్రస్టీ సభ్యులు కృష్ణవేణి, ఉదయ్‌శ్రీ, బాలకృష్ణలచే అమ్మవారి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని లయ పాలక మండలి సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జేబీ.శ్యామ్‌రావు, ఎండోమెంట్ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, బస్తీవాసులు బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవడం అందరి భాధ్యత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రకృతి సమస్త జీవరాశులకు ప్రాణవాయువు అని.. ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యతని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది శ్రీధర్ పోతరాజు అన్నారు. గురువారం అంబేడ్కర్ న్యాయ కళాశాలలో 'పర్యావరణం – చట్టాలు' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు అనేక చట్టాలను తీసుకొచ్చారని చెప్పారు. చెట్టును నరికిన వారికి జరిమానా విధించడంతో పాటు మరికొన్ని చెట్లను నాటించే విధంగా శిక్షలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలితో పర్యావరణంలో జరుగుతున్న పరిణామాలను ఆయన వివరించారు. యువ న్యాయవాదులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం శ్రీధర్ పోతరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపల్ సృజన, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

కాచిగూడ: బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే 42 శాతం రిజర్వేషన్లపై జీవో జారీ చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని 14 బీసీ కుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–డీ6 ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధమైన అధికారం కల్పించిందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని ప్రకారం జీవో తీసుకొచ్చి వెంటనే ఎన్నికలు జరపవచ్చని వారు తెలిపారు. ఎవరైనా సుప్రీంకోర్టుకు వెళ్లినా బీసీలే కేసు గెలిచే అవకాశం ఉంటుందని అన్నారు. బీసీ నేతలు పార్టీలకతీతంగా 42 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బ్రహ్మం గారి దేవాలయం వీధి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యలకు స్థానిక రాంనగర్ దళిత జాతీయ సంఘం నేతల ఫిర్యాదు చేశారు. ఈమ మేరకు అధికారులు నూతన నిర్మాణ భవనాన్ని పరిశీలించి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ దేవేందర్ మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తప్పనిసరిగా అధికారుల అనుమతులు తీసుకుని పనులు చేపట్టాలన్నారు. అధికారులు నామమాత్రం కాకుండా అక్రమ కట్టడాన్ని పూర్తిగా కూల్చివేయాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయండి

నల్లకుంట: మోచీ కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో అనవసర కొర్రీలు పెడుతున్న అంబర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయం ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని సంఘర్ జాతి సంఘ్(మోచీ) విద్యానగర్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగాపై చదువుల కోసం దరఖాస్తు చేసుకునే తమ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారని అన్నారు. గురువారం నల్లకుంట నర్సింహాబస్తీలోని సంఘ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్‌రావుతో కలిసి మాట్లాడారు. ఇదే విషయాన్ని ఇటీవల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తే ఆర్ఐని పిలిపించి కుల ధ్రువీకరణ దరఖాస్తు పత్రాల పరిశీలన పూర్తి చేసి ఆర్డీవోకు పంపించాలని ఆదేశించారన్నారు. అయినా జాప్యం చేస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

తవ్వారు.. మరిచారు.!

కవాడిగూడ: యంత్రాంగం నిర్లక్ష్యం ప్రణాళిక రహితంగా చేపడుతున్న తవ్వకాల వల్ల కవాడిగూడ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. దీంతో స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లను బాగు చేయడానికి శ్రీకారం చుట్టినా పనులు ముందుకు సాగడం లేదు. మరమ్మతుల పేరుతో తవ్వకాలు చేపట్టి పైపు లైన్లు వేసిన తరువాత రోడ్లను బాగు చేయకపోవడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

◆ ఎల్‌బీనగర్‌లో గత నెలరోజులుగా గుంతలమయమైన రోడ్లతో ఎల్‌బీనగర్ వాసులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టుకొని జాప్యం చేస్తున్నారు. ఇది ప్రజలకు శాపంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారయ్యింది.

◆ కొంతమంది స్థానిక నేతలు జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ దారి గుండానే ప్రయాణం కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ చిత్తశుద్ధి లోపించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం గృహ సముదాయం ఎదురుగా డ్రైనేజీ పైపులైన్ల కోసం రోడ్డను మరమ్మతులు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



కవాడిగూడ డివిజన్ పరిధిలోని అనేక బస్తీలలో ఇవే పరిస్థితులున్నాయి. ఈ సమస్యలను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా.

– కార్పొరేటర్ జి.రచనశ్రీ



అధ్వానంగా మారిన రోడ్లు

వీధి లేట్లు వెలగవు..



మా బస్తీలో కనీసం వీధి లైట్లు కూడా వెలగవు. రాత్రి సమయాలలో అనేక సార్లు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి.

– తిరుమల్లేష్, స్థానికుడు

అంగన్‌వాడీలో చిన్నారులను చేర్పించండి

కాచిగూడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశపెట్టిన ప్రీ స్కూల్ విధానం చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని అంగన్‌వాడీ కాచిగూడ సెక్టార్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. గురువారం కాచిగూడ, నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల ప్రవేశాల కోసం ఈనెల 17 వరకు ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మూడేళ్ల వయసు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో విధిగా చేర్పించాలంటూ తల్లిదండ్రులకు సూచించారన్నీ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శివరాణి, ఏఎన్‌ఎం సుజాత, ఆశావర్కర్లు అనిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూనగర్‌లో చిన్నారుల తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ కవిత

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాచిగూడ: కేంద్రలో నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారి పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఎడెల్లి అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 2014 కంటే ముందు 11వ స్థానంలో ఉన్న భారతను నేడు ప్రపంచంలోనే 4వ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది అగ్రరాజ్యాల సరసన చేర్చిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్.కుమార్, సి.కృష్ణ యాదవ్, బంగారు శృతి, డాక్టర్ ఎస్.ప్రకాష్ రెడ్డి, లంకల దీపక్ రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతంరావు, అట్లూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్ తివారి

అభివృద్ధి పనుల్లో రాజకీయాలు వద్దు

ముషీరాబాద్: ప్రజల అవసరాలు తీర్చే విధంగా అభివృద్ధి పనులు కొనసాగాలని అందులో రాజకీయాలు వద్దని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఘాటుగా స్పందించారు. నిబంధనల ప్రకారం రోడ్లు వేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆయన సూచించారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని భరత్‌నగర్‌లో రూ.18 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారి, ఏఈ మురళీలతో కలిసి ఆయన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొంత మంది రాజకీయ దురుద్దేశంతో నిర్మాణ పనులకు అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు.

◆ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ... డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం పోరాడుతుంటే ఇతర పార్టీల నేతలు చెత్త రాజకీయాలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో ముషీరాబాద్ సమస్యను ప్రస్తావించడం వల్లే నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు ముషీరాబాద్ డివిజన్‌లో అధ్వానంగా ఉన్న 35 రోడ్లను ఆధునీకరించామని పేర్కొన్నారు. నాలుగున్నర ఏళ్లల్లో ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, పి.శ్రీధర్‌చారి, ఎం.నవీన్‌గౌడ్, నందు, అనిల్‌కుమార్, కుషాల్‌గౌడ్, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు.



భరత్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియ

పౌరహక్కుల రక్షణకు ఉద్యమాలు నిర్మించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హక్కుల రక్షణ కోసం ప్రజా ఉద్యమాలను నిర్మించాలని అప్పుడే అమర జీవి మద్దికాయల ఓంకార్‌కు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు పల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎంసీపీఐ ఆధ్వర్యంలో 'పౌర హక్కుల పరిరక్షణ –ఓంకార్ పాత్ర' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ పౌర హక్కులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రశ్నించే స్వేచ్ఛ పౌరులకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ... దేశంలో రోజురోజుకు పెరుగుతున్న ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. పౌరహక్కుల రక్షణ కోసం ఓంకార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, వివిధ సంఘాల నాయకులు జెవి చలపాతిరావు, ప్రసాదన్న, రమేష్‌రాజు, దుంకి రాజేష్, నల్ల సూర్య ప్రకాష్, వనం సుధాకర్, కుంభం సుకన్య, తుకారం నాయక్, పెద్దరపు రమేష్, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో ప్రవేశాలకు ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సులు చేసే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులు అర్హులని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 040–24658160, 9491627404.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థలకు సొంత భవనాలు నిర్మించాలని డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు జావెద్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలకు బిల్డింగ్ ఓనర్ తాళం వేసి ఇబ్బందులకు గురి చేయడంతో అక్కడికి చేరుకున్న నాయకులు తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం చిన్నచూపు చూసిందని విమర్శించారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇలాంటి స్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బడి ప్రారంభం రోజునే విద్యార్థులను బడి లోపలికి రానివ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు దీనిపై మాట్లాడకపోవడం బాధాకరమని అన్నారు.

పూలతో అలంకరించి.. గులాబీతో స్వాగతించి.!



విద్యార్థులకు గులాబీ ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

ముషీరాబాద్: పాఠశాలల పునః ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలను పూల తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పాఠశాలలోకి వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు గులాబీ ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే యూనిఫాం, పుస్తకాలు అందజేసి బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్, ఐవోఎస్ స్వరూపారాణి, ఇన్‌చార్జి హెచ్‌ఎం నరేందర్‌యాదవ్, ఉపాధ్యాయులు రత్నం, శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాల నిర్మాణానికి కృషి

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో త్వరలో జూనియర్, డిగ్రీ కళాశాలల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉందన్నారు. విద్యార్థులు ఇక్కడే డిగ్రీ వరకు చదువుకునే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కళాశాల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.


ఐటీఐలను బలోపేతం చేస్తాం: మంత్రి వివేక్



అంబర్‌పేట: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు స్కిల్ డెవలమెంటులో శిక్షణ ఇచ్చేందుకు ఐటీఐలను బలోపేతం చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం విద్యానగర్ శివం రోడ్డులో ఉన్న నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన సదస్సులో మంత్రి మాట్లాడారు. ఐటీఐల బలోపేతానికి సుమారు రూ 4 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేసే స్కిల్ డెవలప్‌మెంటు యూనివర్సిటీకి ఐటీఐలను అనుసంధానం చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. సదస్సులో కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వివిధ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్స్ ప్రియా శ్రీనివాసన్, సుధాకర్ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలకు తాళం

- 13 నెలలుగా అద్దె బాకీ ఉండటంతో తాళం తీయని యజమాని
- అద్దెను చెల్లిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో తాళం తీసిన వైనం
- ఇటు ప్రభుత్వం అటు యజమాని తీరుపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర వ్యాప్తంగా వేసవి సెలవులు ముగియడంతో ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని బాగ్‌లింగంపల్లిలో మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను తెరవడానికి వచ్చిన ప్రిన్సిపల్ వాణిశ్రీకి చేదు అనుభవం ఎదురైంది. బిల్డింగ్ ఓనర్ తనకు 13 నెలల అద్దె బకాయిలు ఉన్నాయని బిల్డింగ్ గేటుకు తాళం వేయడంతో ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది గేటు వద్దనే 2, 3గంటలు వేచి ఉండాల్సి వచ్చింది. విషయం తెలుసుకుని ఘటన స్థలానికి చేరుకున్న హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, పాఠశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడారు. విద్యార్థులను రోడ్లపై ఉంచొద్దని వెంటనే తాళం తీయాలని కోరారు. ఎంతకీ యజమాని వినకపోవడంతో నగర కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి సమాచారం అందించారు.

అద్దెను చెల్లిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో..

◆ కలెక్టర్ సంబంధిత బిల్డింగ్ యజమానితో సంప్రదింపులు జరిపి 13నెలల అద్దెకు గాను 5 నెలల అద్దెను వెంటనే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సదరు బిల్డింగ్ యజమాని సాహిల్ కోఠారి గేటుకు వేసిన తాళాన్ని తీసి ఉపాధ్యాయులు, విద్యార్థులను అనుమతించారు. దీంతో కథ సుఖాంతం అయ్యింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సైతం సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

బిల్డింగ్ యజమానిపై చర్యలు తీసుకోవాలి...

◆ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోకుండా ఇటు ప్రభుత్వం అటు బిల్డింగ్ యజమాని అనుసరించిన తీరు సక్రమంగా లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్‌రెడ్డి, లెనిన్, జావెద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోకుండా బిల్డింగ్ యజమాని సాహిల్ కోఠారి ఇష్టానుసారంగా వ్యవహరించి గేటుకు తాళం వేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. 13 నెలలుగా అద్దె బకాయి ఉంటే ఇన్ని నెలలు ఏం చేశారని ప్రశ్నించారు. విద్యార్థులను నడిరోడ్డుపై నిలబెట్టిన బిల్డింగ్ యజమానిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బడి బతకడం నేర్పిస్తుంది

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్
- బడీడు పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి

కవాడిగూడ: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతోందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం వేసవి సెలవులు ముగిసిన తరువాత పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న సందర్భంగా కవాడిగూడ ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే బతకడం ఎలానో నేర్పిస్తుందని అన్నారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ మండల డిప్యూటీ ఐఓఎస్ జయభారతి, ప్రధానోపాధ్యాయులు మీనాకుమారి, పావన, ఉపాధ్యాయులు సౌజన్య, కిరణ్మయి, నాగేష్, జాని, సుబ్రమణ్యం, వంశీ వీణ, వసంత, మమత, శిరీష్, శైలజ, స్వప్న, అనిల్‌కుమార్, సంధ్య, బీజేపీ నాయకులు వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే దేశాభివృద్ధికి పునాదులు: ఎమ్మెల్యే

ముషీరాబాద్: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట యాత్రను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... పాఠశాలలే దేశాభివృద్ధికి పునాదులు అని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే దేశభక్తితో అన్ని రంగాల్లో ముందుంటారని అన్నారు. అనంతరం పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కడప సురేందర్, అనురాధా, శ్రీనివాస్‌రెడ్డి, యూనిస్, హరీష్, మోజెస్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పిస్తాం..

చిక్కడపల్లి: నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేడే దేవదాసు, ఉపాధ్యాయులు శోభారాణి, సునీత, సౌజన్య, ప్రవళిక, మెరిబా తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట, కాచిగూడ డివిజన్లలో పుస్తకాలు పంపిణీ

నల్లకుంట: వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. గురువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని సత్యానగర్, భాగ్యనగర్ బస్తీలలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటర్ అమృత యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేజీ. బాబు, కె.లక్ష్మణ్‌కుమార్, ప్రశాంత్ జోషి, ఎంబీ. కిషోర్‌కుమార్, మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాచిగూడ: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి అన్నారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు స్కూల్ డ్రెస్‌లు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, టీచర్లు, బీజేపీ నేతలు బల్బీర్, శిర్‌సాగర్, సుభాష్ పటేల్, అరవింద్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడలో పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ జి.రచనశ్రీ, హెచ్‌ఎంలు మీనాకుమారి, పావన



విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్లు అమృత, ఉమారాణి